క్లుప్తంగా

నేడు నాగిరెడ్డిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

పొన్నలూరు: మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. మండంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

31న వలంటీర్లకు ఇంటర్వ్యూలు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 31వ తేదీన 4 గ్రామ వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పైడిపాడులో ఒకటి, ఎడ్లూరుపాడులో రెండు, నర్సింగోలులో ఒక పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న వారు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

27న బైక్ వేలం

సింగరాయకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 27వ తేదీన ఉదయం 11 గంటలకు ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు పర్యవేక్షణలో 2018 మోడల్ హీరోహోండా బైక్ వేలం వేయనున్నట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. ఔత్సాహికులు వేలంలో పాల్గొనాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

రహదారి భద్రతపై అవగాహన



బహుమతులు అందజేస్తున్న రఫీ, ఎంఈఓ, హెచ్‌ఎం

కందుకూరు అర్బన్: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగింది. కందుకూరు మోటారు తనిఖీ అధికారి షేక్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రహదారిపై వెళుతున్నప్పుడు, రహదారులను దాటుతున్నప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. ఎంఈఓ ఎస్. వెంకటేశ్వర్లు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి. అనూరాధ.. విజేతలకు బహుమతులను అందజేశారు.

100 శాతం పన్ను వసూలు చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రఫీక్ అహ్మద్

వలేటివారిపాలెం: మండలంలో 100 శాతం పన్నులు వసూలు చేయాలని మండల ఎంపీడీఓ షేక్ రఫీక్ అహ్మద్ అన్నారు. వలేటివారిపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యాక్రమాలు సకాలంలో నిర్వహించాలని అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించి వారికి సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఈఓఆర్‌డీ సుమంత్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ, ఏఈ

ఉలవపాడు: ప్రభుత్వం నుంచి సిమెంటు రావడంతో మండలంలో అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి. ఇటీవల పోర్టల్ నుంచి ఆన్‌లైన్ సమస్య వలన సిమెంటు రావడంలో కొంత జాప్యం జరిగింది. ఈ విషయం అధికారులు స్థానిక ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించి కాల్వల నిర్మాణానికి సిమెంటు వచ్చేలా చేశారు. ఎమ్మెల్యేకు, ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఏఈ నాయబ్ రసూల్, వైస్ యంపీపీ సయ్యద్ ఫజుల్ పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

వలేటివారిపాలెం: చెట్టుపై నుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన అత్తంటివారిపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. అత్తంటివారిపాలెం గ్రామానికి చెందిన నడిపినేని రమేష్ (39), నడిపినేని గోవిందయ్య చింత చెట్టు కొడుతున్న సమయంలో కొమ్మ విరిగి ప్రమాదవశాత్తు కింద పడి చనిపోయాడు. రమేష్ తండ్రి మాలకొండయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై సుదర్శన్ యాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

పీసీపల్లి(కనిగిరి రూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పీసీపల్లి మండలం గోగులపల్లి పంచాయతీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందచేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతుందన్నారు. కరోనా కష్ట కాలంలో సైతం ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన రాష్ట్ర ప్రజలను ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. ఎమ్మెల్యే బుర్రా ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌ను అందచేశారు. తొలుత ఎమ్మెల్యే బుర్రాకు సర్పంచ్ నసీబా, నజీర్, కో ఆప్షన్ సభ్యుడు కరీం, స్థానిక నాయకులు పుల్లారెడ్డి, బ్రహ్మారెడ్డి, బాజీ మాలకొండారెడ్డి, వరమ్మ, కొండల రావులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్యాల జఘన్య, ఎంపీటీసీ సతీష్ చౌదరి, జెడ్పీటీసీ ఓకేరెడ్డి, మండల కన్వీనర్ జి.బొర్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ సుదర్శన్, మేకల మాల్యాద్రి, వేణు, బోడ్డు బోయిన వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శనలు మేధాశక్తిని పెంపొందిస్తాయి



సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న డిప్యూటీ డీఈఓ, హెచ్‌ఎంలు

కనిగిరి రూరల్: సైన్స్ ప్రదర్శనలు విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందిస్తాయని డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వరరావు అన్నారు. పట్టణంలోని చింతపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ ఫేర్ ప్రదర్శనను డిప్యూటీ డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానం పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా తయారు కావాలని ఆకాంక్షించారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు రమణయ్య పర్యవేక్షణలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల సైన్స్ ప్రదర్శనలు తిలకించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు నక్కా ఉమాదేవి, రామనబోయిన ప్రశాంతి, ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఎస్‌కే ఫాతీమాబీ, బైరెడ్డి, నక్కా రామకృష్ణ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



గ్రామసభలో మాట్లాడుతున్న డీఆర్‌పీ బావయ్య

హనుమంతునిపాడు: మండల పరిధిలోని హాజీపురం సచివాలయంలో మంగళవారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు, ఉపాధి నిధులతో జరిగిన పంచాయతీ రోడ్లు, భవనాలు, వన సంరక్షణ పనులు, మొక్కల పెంపకం పనులు పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి జాబ్ కార్డుపై కూలీల చేసిన పనులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి ఈ ఏడాది జరిగిన పనులు వివరాలు గ్రామసభలో చదివి వినిపించారు. ఏపీఓ వేంకటేశ్వర్లు, టీఏ కిషోర్, ఎఫ్‌ఏ ప్రేమ్‌కుమార్, బృంద సభ్యులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ



హెల్మెట్ వాడతామని వాహనదారులతో ప్రమాణం చేయిస్తున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: హెల్మెట్ ధరిచి ప్రాణాలు కాపాడుకోవాలని సీఐ దాచేపల్లి రంగనాథ్ ప్రజలకు సూచించారు. స్థానిక కందుకూరు రోడ్డు సెంటర్‌లో హెల్మెట్ వాడకంపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. సీఐ రంగనాథ్ మాట్లాడుతూ.. ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలవడం వల్ల మరణాలు సంభవిస్తున్నాయని, హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. హెల్మెట్ ధరిస్తామంటూ వాహనదారులతో ప్రమాణం చేయించారు. ముందుగా స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి కందుకూరు రోడ్డు సెంటర్ వరకు పోలీసులు మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా, ఏఎస్సై షేక్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సంపత్‌కుమార్

హనుమంతునిపాడు: రబీలో పంటలు సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి సంపత్‌కుమార్ అన్నారు. పెద్దగొల్లపల్లి రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం సచివాలయం కింద ఖరీఫ్, రబీ సీజనల్‌లో సాగు చేసిన పంటలు, పంటల వివరాలు పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 14,495 ఎకరాల్లో ఈ క్రాప్ చేశామన్నారు. ప్రధానమంత్రి కిసాన్ నిధి యోజన పథకం భాగంగా 13వ విడత డబ్బులు పడాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలన్నారు. వ్యవసాయ సహాయకులు బి.కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశం

కనిగిరి రూరల్: మహిళా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరా క్రాంతి పథం గ్రామ సంఘాలు, సహాయకులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పథకంలో మహిళలే ప్రాధాన్యం కల్పిస్తూ రూపకల్పన చేస్తున్నారని గుర్తు చేశారు. స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్, హెచ్‌డీ వీఆర్‌ఎఫ్, సున్నా వడ్డీ వంటి అనేక పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎం జీవరత్నం మాట్లాడుతూ గ్రూపు సంఘాల్లోని మహిళలు తీసుకున్న బ్యాంక్ రుణాలను సకాలంలో చెల్లించి రాయితీలను పొందాలన్నారు. సీసీలు మహబూబ్ బాషా, బి.సుబ్రహ్మణ్యం, ఎంఎంఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన నీరు అందించండి



మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న దీఈ రాంమోహనరావు

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి మూడు భారీ మంచినీటి పథకాల ద్వారా ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాంమోహనరావు చెప్పారు. మంగళవారం పెంట్రాల వద్ద ఉన్న రాళ్లపాడు–రోళ్లపాడు, రాళ్లపాడు వద్ద ఉన్న గుడ్లూరు–రాళ్లపాడు రక్షిత మంచినీటి పథకాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ రక్షిత మంచినీటి పథకాల వద్ద ఉన్న సంపులను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లించాలన్నారు. మాలకొండ్రాయునిపాలెంకు మంచి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

గుడ్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పెదలాటరఫి గ్రామంలోని ఉప్పుటేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న కందుకూరు సెబ్ ఎస్సై మౌలాలి తన సిబ్బందితో కలిసి దాడి చేసి ట్రాక్టరును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ట్రాక్టరును గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కరేడు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్ర స్థాయి కబడ్డీకి ఎంపికైన కరేడు విద్యార్థులు

ఉలవపాడు: రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు కరేడులోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన ఇద్దరు ఎంపికై నట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. పదో తరగతి చదువుతున్న బుచ్చంగారి హేమలత, 8వ తరగతి చదువుతున్న కుమారి నిరీష పొట్టిశ్రీరాములు నెల్లూరు జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25,26 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరు ఇటీవల కోవూరులో జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఆవుల శ్రీనివాసులు, గ్రామస్తులు అభినందించారు.

తైక్వాండో జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

కందుకూరు రూరల్: అంతర్ జిల్లాల తైక్వాండో పోటీలకు జిల్లా (ఉమ్మడి) క్రీడాకారుల ఎంపిక స్థానిక ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించినట్లు తైక్వాండో రాష్ట్ర ట్రెజరర్, జిల్లా కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ సలాం మంగళవారం తెలిపారు. తైక్వాండో సబ్ జూనియర్, క్యాడేట్, జూనియర్, సీనియర్ బాల, బాలికల పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొనగా 48 మంది ఎంపికై నట్లు తెలిపారు. ఈ నెల 29, 30, 31వ తేదీల్లో విశాఖపట్నంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, జిల్లా తైక్వాండో అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, గౌరవ అధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు (తిమోతి), ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల డైరెక్టర్ బాలభాస్కర్ మాట్లాడుతూ క్రీడలు మానసికంగా, శారీరకంగా ఉపయోగపడతాయన్నారు. రెఫరీలుగా షాహిద్, మసూద్, విశ్వకాంత్, దినేష్ వ్యవహరించారు. తైక్వాండో జిల్లా వైస్ ప్రెసిడెంట్ సలావుద్దీన్, కోచ్ అఖిల్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

బాలుర విభాగంలో: షేక్ మినహాస్, షేక్ షంషుంజమా, జి.వరుణ్ చౌదరి, జి.మోజేష్, మనోహర్, జి.జాషువా, పి.స్టీఫెన్, జాన్‌పాల్, టి.లక్ష్మీసాయి, దినేష్, షాహిద్, మసూద్, చైతన్య, కరిముల్లా.

బాలికల విభాగంలో: సమ్మరీన్ సుల్తానా, బ్లెస్సి, సీహెచ్.శ్రావ్య, బి.అక్షర, సాయి ప్రియ, ఐ.శ్రావ్య, వినీత, దివ్య, యాస్మిన్ బేగ్, నూర్జహాన్ బి. పి.మెరిస్టెల్లా.

ఓటర్ల దినత్సోవం ర్యాలీ నేడు

కందుకూరు రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు రెవెన్యూ డివిజనల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డి.సీతారామయ్య తెలిపారు. అధికారులు, ఓటర్లు పాల్గొనాలని కోరారు.

ఆడబిడ్డలను ఆత్మగౌరవంతో బతకనిద్దాం

టంగుటూరు: ఆడబిడ్డలను రక్షిద్దాం ఆత్మగౌరవంతో బతకనిద్దామని ఐసీడీఎస్ సూపర్వైజర్ సైదాబీ పేర్కొన్నారు. మండలంలోని జమ్ములపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో గ్రామంలో అంతర్జాతీయ బాలికా వారోత్సవ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. కారుమంచి, టంగుటూరు, వల్లూరు, కందులూరు సెక్టార్లలో ర్యాలీలు చేపట్టారు.

భ్రూణ హత్యలు నివారించాలి

మద్దిపాడు: ఆడపిల్లలను గర్భస్థ దశలోనే చిదిమేయడం మానుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత హితవు పలికారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బొడ్రాయి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద విద్యార్థులతో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, మహిళా పోలీస్ టి.కృష్ణవేణి, సీనియర్ అసిస్టెంట్ ఎం శేషాచలం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్బీకేలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

కొండపి: స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనుల్లో నాణ్యతతోపాటు రికార్డులను విజిలెన్స్ డీఎస్పీ అశోక్‌వర్ధన్ తనిఖీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశ భక్తి కలిగి ఉండాలి



గుడ్లూరులో భారతమాత చిత్రపటానికి నివాళులు

గుడ్లూరు: ప్రతి ఒక్కరూ దేశ భక్తి కలిగి ఉండి దేశాభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్ అన్నారు. భారత గణతంత్ర వేడుకల్లో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భారత మాత చిత్రపటానికి పూల మాలవేసి నినాదాలు చేశారు. వీఆర్వో హరిబాబు, సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ రమేష్, మండల కన్వీనర్ చలువాది శ్రీనివాసులు, ప్రమీలా సుధాకర్, పాజర్ల సర్పంచ్ పాటి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, శివ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

76 మందికి సెల్‌ఫోన్లు అంజేత

టంగుటూరు: మండలంలో ఇప్పటి వరకు 76 మందికి పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు కనుగొని ఫిర్యాదుదారులకు అందిచామని ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో మంగళవారం టంగుటూరు గ్రామానికి చెమదిన వల్లూరు సుధాకర్ ఆచారికి పోగొట్టుకున్న సెల్‌ఫోను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటి వరకు 205 మందికి సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా 76 మందికి తిరిగి అప్పగించినట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



పైరెడ్డిపాలెంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న అశోక్‌బాబు



నర్సరాజుపాలెంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

పొన్నలూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని పైరెడ్డిపాలెంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించగా గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు వందల సంఖ్యలో చేరుకొని అశోక్‌బాబుకు స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. ముందుగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 150 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయిలో నెరవేర్చి ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి జన్మభూమి కమిటీల పేరుతో ప్రజా ధనాన్ని దోచేశారన్నారు. కానీ నేడు సీఎం పాలనలో వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ పింఛన్ కానుక, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి వినూత్న పథకాలతో నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదును జమ చేస్తూ గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ కర్నా సావిత్రమ్మ, కర్నా మస్తాన్‌రెడ్డి, సగిలి శ్రీనివాసుల రెడ్డి, దుద్దుగుంట శ్రీరాములు, సన్నపురెడ్డి మాల కొండారెడ్డి, పల్లపోలు బాలకోటిరెడ్డి, సిరిగిరి గోపాల్‌రెడ్డి, పిల్లి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దిపూడి: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని తంగెళ్ల సచివాలయ పరిధిలోని నర్సరాజుపాలెం, అయ్యవారిపాలెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటూ ప్రజల సమస్యలను అశోక్‌బాబు అడిగి తెలుసుకున్నారు. నవరత్న పథకాల ద్వార పేదల జీవన పరిస్థితులు మెరుగు పడ్డాయన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజల సొమ్మును దోచేశాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పథకాలన్నీ ఇంటికే వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజాపాలనను చూసి ఓర్చుకోలేని టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నర్సరాజుపాలెం, అయ్యవారిపాలెం గ్రామాల్లో పలువురు పింఛన్లు, గృహాలు మంజూరు చేయాలని వరికూటికి విన్నవించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు దొడ్డాల మల్లికార్జున, వైఎస్ ఎంపీపీ నాసర్‌వలి, తంగెళ్ల సర్పంచ్ నర్సమ్మ వెంకటేష్‌రాజు, బొమ్మినేని మధు, బొమ్మినేని రఘు, చేకూరి శ్రీనివాసరావు, తూళ్లూరి కలందర్‌రావు, కొత్తపల్లి రామకోటయ్య, బోద చినవెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం



కనిగిరిలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: మహిళల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వ అనేక చట్టాలను అమలు చేస్తోందని మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. జిల్లా మహిళా అభివృద్ధి సంస్థ, శిశు సంక్షేమ శాఖ, సర్వశిక్షా భియాన్ మండల న్యాయసేవాధికార సంస్థల ఆధ్వర్యంలో స్థానిక కాశిరెడ్డి కాలనీలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. బాలికల విద్యకు ప్రభుత్వం అనేక పథకాలు చేపడుతున్నట్లు తెలిపారు. సీడీపీఓ సంగీత లక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాల నివారణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలికలకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియా హర్షానంద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్, హెచ్‌ఎం భారతి, ఎమ్మెస్సార్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ టి. వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పీసీపల్లి: మండలంలోని పెదయిర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వయంకృషి సేవా సంస్థ సభ్యుడు నాయబ్‌రసూల్ మాట్లాడుతూ సమాజంలో పురుషుల కంటే బాలిక సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎల్ అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం: విద్యతోనే బాలికా వికాసం సాధ్యమని మానవహక్కుల సంఘం అధ్యక్షుడు, జాతీయ విద్యారత్న అవార్డ్ గ్రహీత షేక్.గౌస్ అన్నారు. మండలంలోని డీజీపేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం పాఠశాల హెచ్‌ఎం శేఖర్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన షేక్.గౌస్ మాట్లాడుతూ స్త్రీలు పురుషులతో అన్ని రంగాల్లో సమానంగా రాణించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

కందుకూరు రూరల్: ఆడ పిల్లల ఎదుగుదలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ అన్నారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అధ్యాపకులు కె.సుజాత, జె.మైత్రి, అనూష, ఎం.జ్యోతి, ఇంద్రజ, విద్యార్థినులు పాల్గొన్నారు. పలుకూరు సచివాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీటీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు.ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఓగూరు గ్రామం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన కళాశాలలో అసోసియేట్ డీన్ ఎస్ఎస్.విజయపద్మ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పామూరు: బాల్య వివాహాలు చేయడం నేరమని, అది ఆరోగ్యానికి అనర్ధమని కేజీబీవీ ఎస్ఓ హెప్సిబా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం, గోళ్ల పద్మజ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక కేజీబీవీతో పాటు మండలంలోని బొంపెద్దుపాడులో స్వయంకృషి స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నాయబ్‌రసూల్, కేజీబీవీ ఏఓ వాణి, జయలక్ష్మి, హెచ్‌ఎం జ్యోతి పాల్గొన్నారు.

గుడ్లూరు: జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం మొగుళ్ళూరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో నిర్వహించారు. ఎస్సై ప్రసాద్‌రెడ్డి, వైద్యాధికారి సాయి ప్రియాంక మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష లేని సమాజాన్ని నిర్మించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ సింధు, ఏఎన్‌ఎం కుమారి, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

లింగసముద్రం: దిశ యాప్, పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు అన్నారు. జంపాలవారిపాలెం వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తుంటే వెంటనే 100కి సమాచారం ఇవ్వాలన్నారు.

సింగరాయకొండ: బాలికల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్‌ఎం డిజభారతి పేర్కొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్‌ఎం డి.భారతి మాట్లాడుతూ.. బాలికల సంరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని, దిశ యాప్, దిశ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలికా సంరక్షణ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.